# దేశీయ ఎయిర్‌లైన్స్ ద్వారా ప్రయాణించే ప్రయాణీకులు వార్షిక వృద్ధి 36.10% మరియు నెలవారీ వృద్ధి 15.24% నమోదు

న్యూఢిల్లీ, జూన్ 17:దేశంలోని పౌర విమానయాన రంగం అద్భుతమైన వృద్ధిని సాధించింది. దేశీయంగా విమానయాన సంస్థల్లో ప్రయాణించే ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వివిధ దేశీయ విమానయాన సంస్థలు అందించిన ట్రాఫిక్ డేటా ఆధారంగా జనవరి-మే 2023లో ప్రయాణీకుల సంఖ్య 636.07 లక్షల మైలురాయిని చేరుకుంది. ఇది జనవరి-మే 2022 సంవత్సరంతో పోల్చితే 36.10% గణనీయమైన వార్షిక వృద్ధి రేటును ప్రతిబింబిస్తుంది. ఆ సమయంలో ప్రయాణీకుల సంఖ్య 467.37 లక్షలు.

2022,మే నెలలో ప్రయాణీకుల సంఖ్య 114.67 లక్షలు కాగా అది 2023 మేలో 132.41 లక్షలకు పెరిగింది. నెలవారీ వృద్ధిని 15.24% నమోదు చేసింది. సురక్షితమైన, సమర్థవంతమైన మరియు కస్టమర్-కేంద్రీకృత విమానయాన పర్యావరణ వ్యవస్థను పెంపొందించడంలో విమానయాన సంస్థలు, విమానాశ్రయాలు మరియు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ యొక్క సమిష్టి కృషికి ఈ స్థిరమైన వృద్ధి నిదర్శనం.

ఏప్రిల్ 23తో పోలిస్తే మే 2023లో మొత్తం ప్రయాణీకుల సంఖ్య 3.26 లక్షలు (2.52%) పెరిగింది.

ప్రయాణీకుల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల భారతదేశ విమానయాన రంగ బలం మరియు మన్నికను ప్రదర్శిస్తుంది. కనెక్టివిటీని మెరుగుపరచడానికి మరియు మన దేశ పౌరులకు సౌకర్యవంతమైన ప్రయాణ ఎంపికలను అందించడానికి నిరంతర కృషి జరుగుతోంది. జనవరి-మే 2023 మధ్యకాలంలో 636.07 లక్షల మంది ప్రయాణీకుల అధిక లోడ్ ఫ్యాక్టర్ విమాన రవాణాకు పెరుగుతున్న డిమాండ్‌ను సూచిస్తుంది, ఇది విమానయాన పరిశ్రమ యొక్క అనుకూలమైన దిశను చాటిచెబుతోంది.

అలాగే మే 2019 కంటే మే 2023లో ఫిర్యాదుల సంఖ్య తగ్గింది. మే 2019లో షెడ్యూల్ చేయబడిన దేశీయ విమానయాన సంస్థలకు మొత్తం 746 ప్రయాణీకులకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. అయితే, మే 2023లో షెడ్యూల్ చేయబడిన దేశీయ విమానయాన సంస్థలకు మొత్తం 556 ప్రయాణీకులకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి.

కేంద్ర పౌర విమానయాన మరియు ఉక్కుశాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం.సింధియా ప్రకారం "విమానయాన రంగం వృద్ధిని ప్రోత్సహించడంలో మరియు భారతదేశాన్ని ప్రముఖ ప్రపంచ విమానయాన కేంద్రంగా స్థాపించడంలో వాటాదారులందరి సహకార ప్రయత్నాలు కీలక పాత్ర పోషించాయి. దేశీయ విమానయాన పరిశ్రమ యొక్క స్థిరమైన విస్తరణ మరియు ప్రాంతీయ విమానయాన సంస్థల పుట్టుక మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. దేశం అంతటా ప్రజలను కలుపుతున్నాయి మరియు ఉడాన్ పథకం ద్వారా చివరి మైలు కనెక్టివిటీకి భరోసా ఇస్తున్నాయి. భద్రత, సామర్థ్యం మరియు ప్రయాణీకుల సంతృప్తి అత్యున్నత ప్రమాణాలను నిర్ధారిస్తానే, విమానయాన పరిశ్రమ అభివృద్ధి చెందడానికి మరియు స్థిరమైన వృద్ధిని ప్రోత్సహించడానికి అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడానికి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది"

ఈ సాధన అనేది పరిశ్రమ యొక్క సంపూర్ణమైన ప్రణాళిక, కార్యాచరణ ప్రభావం మరియు క్రియాశీలక చర్యల ఫలితం. కొవిడ్-19 మహమ్మారి తరువాత విమానయాన సంస్థలు మెరుగైన విమాన సేవలతో పాటు ప్రయాణీకులకు సున్నితమైన మరియు అవాంతరాలు లేని ప్రయాణ అనుభవాలను అందించడం ద్వారా స్థితిస్థాపకతను ప్రదర్శించాయి.

# ఐ.జి.ఆర్.ఎస్ రిజిస్ట్రేషన్ విధానం ప్రజలకు ఎంతో ఉపయోగకరం

## -జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్




సంగారెడ్డి జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);సంగారెడ్డి జిల్లా, సదాశివపేట పట్టణం ఎన్ గార్డెన్స్ లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవం వేడుకలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. ఐ.జి.ఆర్.ఎస్ రిజిస్ట్రేషన్ విధానం , మ్యుటేషన్ విధానం పై ప్రజలకు అవగాహన కల్పించడానికి అవకాశాన్ని ఇచ్చిన సదాశివపేట మున్సిపాలిటీ యంత్రాంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రజలకు ఐ.జి.ఆర్.ఎస్ రిజిస్ట్రేషన్ విధానం చాలా ఉపయోగకరమని ఈ యొక్క పోర్టల్ ద్వారా ప్రజలు అన్ని సౌకర్యాలను ఇంటి నుండే సద్వినియోగం చేసుకోవచ్చునని తెలిపారు. మరియు ఎవరైనా రిజిస్ట్రేషన్ కోసం వెళితే సంబంధిత డాక్యుమెంట్స్ ని రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది ఐ.జి.ఆర్ ఎస్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రాసెస్ చేసిన వెంటనే కొనుగోలు దారుడు నుండి లబ్ధిదారుని పేరు పైకి మ్యుటేషన్ ప్రక్రియ జరుగుతుందని తద్వారా ప్రజలకు మున్సిపల్ కార్యాలయల చుట్టూ తిరిగే పనేలేదని తెలియజేశారు. ఇట్టి విధానాన్ని అమలులోకి తీసుకువచ్చిన కల్వకుంట్ల తారక రామారావు గారికి, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి అదేవిధంగా ప్రజా సమస్యల పైన దూర దృష్టితో పనిచేస్తున్న మంత్రివర్యులు హరీష్ రావు గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ కుమార్ గారు, సదాశివపేట మున్సిపాలిటీ యంత్రాంగం, కౌన్సిలర్లు మరియు చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ గారు, ప్రజా నాయకులు పాల్గొన్నారు.

# మానవత్వమే యోగా తత్వం - శ్రీమతి లిల్లీ మేరి




సిద్దిపేట జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మానవత్వమే యోగా తత్వం అని మనందరికీ తెలిసినంతవరకు యోగ అంటే వివిధ ఆసనాల ద్వారా శారీరిక వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునే ఓ విధానం అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి అన్నారు. ఈ సందర్భంగా లిల్లీ మేరి మాట్లాడుతూ యోగానికి, మానవత్వాన్ని కూడా జోడించి మరింత మందికి చేరువ చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్ష ఆహ్వానించదగినదని, వసుదైవ కుటుంబం అనే ఇది వృత్తంతో ఈ ఏడాది నిర్వహించనున్న యోగా దినోత్సవం అని, యోగ తత్వము మానవ తత్వము అనే సద్భావన ప్రతి ఒక్కరిలో కలుగజేస్తుందని, మానవ తత్వము యొక్క ప్రధాన అంతరార్థం కూడా సేవా మార్గమే. రండి..., లేవండి ..., మేల్కొండి...! గమ్యం చేరే వరకు విశ్రమించకండి అని వివేకానందుని పిలుపు ఎందరినో ఉత్తేజపరిచిందని, మన భారతీయ ఆరోగ్య, ఆనంద, జీవన కళ యోగాను అంతర్జాతీయంగా ఆచరించేందుకు కృషిచేసిందని, దాని కారణంగా ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకునేలా 2014 డిసెంబర్ 11న తీర్మానం చేసింది. సర్వ ప్రతినిధి సభ ప్రకటించిన ఈ తీర్మానాన్ని 193 సభ్య దేశాలు అంగీకరించగా అందులో 177 దేశాలు సహ ప్రయోజకులుగా వ్యవహరించడానికి ముందుకు రావడం శుభపరిణామం అని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి అన్నారు. ఈ సందర్భంగా లిల్లీ మేరి మాట్లాడుతూ పతాంజలి మహర్షి రచించిన యోగ సూత్రాలకు ఆలంబనగా నిలిచాయి. ఆయన రచించిన 195 యోగా సూత్రాలు ఎన్ని తరాలు మారినా నిత్య నూతనంగా ఆచరించబడుతున్నాయి. ఆయన వివరించిన అష్టాంగ యోగాలలో యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి. అయితే వీటిలో ఆసనాలు, ప్రాణాయామము, ధ్యాన క్రియలు యోగా సాధనలో ప్రధానమైనవిగా పేర్కొంటారు. ఈ క్రియలను సాధన చేస్తే గొప్ప ప్రయోజనం కలుగుతుందని లిల్లీ మేరి అన్నారు.

యోగా తో ప్రయోజనాలు:

ప్రపంచంలో వచ్చిన సాంకేతిక విప్లవము మనిషి జీవనశైలిని ప్రభావితం చేస్తున్నది. మనిషి కాలముతో పరిగెడుతున్నాడు. ఈ క్రమంలో శారీరక శ్రమ కంటే మేధోశ్రమకు ప్రాధాన్యత పెరిగింది. ఇది మానసిక ఒత్తుడలకు, శారీరక రుగ్మతలకు కారణమవుతున్నాయి. ఈ స్థితి నుంచి బయటపడటానికి యోగాను తమ జీవన విధానంలో భాగముగా మార్చుకోవాలి. యోగా అభ్యాసము వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నాయని శాస్త్రీయ పరిశోధనల ద్వారా వెలుగు చూస్తున్న నిజాలు. కండర బలాన్ని పెంచుకోవడంతో పాటు, శరీరాన్ని మనకు అనువైనదిగా మార్చుకోవటం, శ్వాసకోశ వ్యవస్థను మెరుగుపరుచుకోవటం, మానసిక ఒత్తిడి, ఆందోళనలు దరిచేరకుండా ఉండటం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను తగ్గించుకోవడంతోపాటు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తించాలి. అంతేకాదు శారీరక మానసిక వికాసాలతో పాటు, విద్యారంగము, క్రీడలు, కళారంగాలలో గొప్ప ఫలితాలు సాధించడంలో యోగా గొప్ప శక్తిగా నిలుస్తున్నది. తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి అన్నారు.

# రూ. 88 వేల కోట్లు మాయం చేసిన మోదీ రాజీనామా చేయాలి : వై సతీష్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 17: కేంద్రంలో మోదీ సర్కార్ చరిత్రలో ఎవరు కనివిని ఎరుగని అతిభారీ స్కాంకు పాల్పడింది అని తెలంగాణ రెడ్‌కో చైర్మన్ వై సతీష్ రెడ్డి ఆరోపించారు. పెద్ద నోట్ల రద్దు సమయంలోనే భారీగా బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకున్నారని బీజేపీపై ఆరోపణలు వచ్చాయి. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో పాటు.. కొందరు బీజేపీ నాయకులకు చెందిన కొన్ని బ్యాంకుల్లో భారీగా బ్లాక్ మనీని మార్పిడి చేశారని ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు అంతకుమించిన మరో భారీ స్కాం బయటపడింది. బీజేపీ అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట. ఏ రంగాన్ని వదలకుండా కాంగ్రెస్ స్కాములు చేస్తే.. బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కొత్త కొత్త విధానాల్లో స్కాములు చేస్తోంది అని సతీష్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

కొత్తగా ముద్రించిన దాదాపు రూ. 88,032 కోట్ల విలువైన 500 నోట్లు మాయమయ్యాయి. ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద పిటిషన్ వేయడంతో ఈ ఘటన బయటపడింది. దేశంలోని 3 ఆర్బీఐ నోట్ల ముద్రణాలయాల్లో ప్రింట్ అయిన నోట్లు మాయం కావడం ఘోరం. తాము ముద్రించి పంపించేసామని సంస్థలు చెప్తున్నాయి. అంటే 88 వేల కోట్ల రూపాయలు ఏమైపోయినట్టు? ఇవన్నీ ఎవరి జేబుల్లోకి చేరినట్టు? ఈ వ్యవహారం అంతా చూస్తే దీని వెనకాల బీజేపీ భారీ కుట్ర చేసినట్టుగా కనిపిస్తోంది అని ఆయన పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల కోసం భారీగా కరెన్సీ నోట్లను.. అధికారాన్ని అడ్డం పెట్టుకొని దారి మళ్లించినట్టుగా స్పష్టమవుతోందని సతీష్ రెడ్డి అన్నారు. నోట్లను దాచిపెట్టి వాటిని ఎన్నికల్లో ఖర్చు పెట్టడానికి, రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చడానికి వినియోగించాలని బీజేపీ కుట్రలు చేస్తోంది. ఇంత భారీ మొత్తంలో కరెన్సీ నోట్లు మిస్సయినా ఇప్పటివరకు దీనిపై కేంద్రం సీబీఐ ఎంక్వైరీకి కనీసం పోలీస్ ఎంక్వయిరీకి కూడా ఆదేశించకపోవడాన్ని బట్టి దీని వెనకాల భారీ కుట్ర ఉందన్న విషయం తేటతెల్లమవుతోంది. కనిపించకుండా పోయిన 88 వేల కోట్ల విలువైన కరెన్సీ నోట్లు కచ్చితంగా బీజేపీ నాయకుల ఎలక్షన్ వార్ రూమ్‌కి చేరాయి. దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలి. దీనికి బాధ్యతగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలి. దీనిపై ఇప్పటివరకు స్పందించకుండా చర్యలు తీసుకోకుండా ఉన్న రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తి కాంతదాస్ ని ఆ పదవి నుంచి తొలగించాలి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, ఆర్థిక శాఖ మాజీ మంత్రి పీయూష్ గోయల్ పైనా చర్యలు తీసుకోవాలి అని వై సతీష్ రెడ్డి డిమాండ్ చేశారు

## ప్రింటింగ్ ప్రెస్ నుంచి 88వేల కోట్ల విలువైన రూ.500 నోట్ల మాయం

ముంబై, జూన్ 17:ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 88వేలకు పైగా కోట్లు గల్లంతయ్యాయి. అవన్నీ కూడా. 500 నోట్లే. ప్రింట్ అయ్యాయి.. కానీ ఆర్బీఐకి చేరలేదు. అసలేమయ్యాయి. అయితే మనోరంజన్ రాయ్ అనే సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా సేకరించిన గణాంకాల ద్వారా ఈ విషయం బయటపడింది. అయితే ఇండియాలో కరెన్సీ నోట్లను ముద్రించే యూనిట్లు మూడు ఉన్నాయి. అందులో ఒకటి బెంగళూరులోని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రన్ (పి) లిమిటెడ్, నాసిక్‌లోని కరెన్సీ నోట్ ప్రెస్, మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌లో ఉన్న బ్యాంక్ నోట్ ప్రెస్ ఉంది..ఈ మూడు మింట్‌లూ కొత్తగా డిజైన్ చేసిన రూ.500 నోట్లను 8,810.65 మిలియన్ల నోట్లను ముద్రించి సరఫరా చేశాయి. అయితే వీటిలో ఆర్బీఐకి చేరినవి 7,260 మిలియన్లు మాత్రమే నని మనోరంజన్ రాయ్ సమాచార హక్కు చట్టం కింద పొందిన గణాంకాలు చెబుతున్నాయి. అంటే రూ. 88,032.5 కోట్ల విలువైన 1,760.65 మిలియన్ల రూ.500 నోట్లు గల్లంతయ్యాయని ఆయన ఆరోపిస్తున్నారు.

# కేంద్ర బలగాల మోహరింపు ఆదేశాలపై సుప్రీంకోర్టుకు మమత సర్కార్

కోల్‌కతా జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పశ్చిమబెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించాలంటూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను మమతా బెనర్జీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంయుక్తంగా శనివారంనాడు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్, ప్రభుత్వం తరఫు సీనియర్ అధికారులు శుక్రవారంనాడు సమావేశమై హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు ఎస్ఈసీ వర్గాలు తెలిపాయి.పశ్చిమబెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల కోసం 48 గంటల్లోగా కేంద్ర బలగాలను మోహరించేలా చూడాలంటూ కోల్‌కతా హైకోర్టు గత బుధవారం నాడు ఎస్ఈసీకి ఆదేశాలిచ్చింది. పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో హింస చెలరేగడాన్ని హైకోర్టు ప్రస్తావిస్తూ, జూన్ 13న తాము ఆదేశాలు ఇచ్చినప్పటికీ సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని పేర్కొంది.

**బీజేపీ ఫిర్యాదు**

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర బలగాలను మోహరించేలా తగిన ఆదేశాలివ్వాలంటూ బీజేపీ నేతలు సువేందు అధికారి, కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి హైకోర్టును ఇంతకుముందు ఆశ్రయించారు. 2022 మున్సిపల్ ఎన్నికల్లోనూ, 2021లో కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ పెద్దఎత్తున హింస చెలరేగిన ఘటనలను తమ పిటిషన్లలో వారు కోర్టు దృష్టికి తెచ్చారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ ఇంట్లో ముగిసిన ఐటీ సోదాలు

## -కావాలనే బీఆర్ఎస్ నేతలపై ఐటీ దాడులు :పైళ్ల శేఖర్ రెడ్డి

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్) : బీఆర్ఎస్ నేతలపై కావాలనే ఐటీ దాడులు చేస్తున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి మండిపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సోదాలు చేపట్టిన ఐటీ అధికారులకు అన్ని రకాలుగా సహకరించామన్నారు. వాళ్ళు వచ్చిన గంటన్నరలోపే పూర్తి వివరాలు ఇచ్చినట్లు తెలిపారు. అయినా మూడురోజులు ఏదో సాధించాలని కాలయాపన చేశారని విమర్శించారు. నోటీసులు ఇచ్చి వెళ్లారని... మళ్ళీ అవసరమైతే రావాలని చెప్పారని అన్నారు. రియల్ ఎస్టేట్, డెవలపింగ్ తప్ప ఏ వ్యాపారాలు తనకు లేవన్నారు. బ్యాంక్ లాకర్లు తెరిచారన్నారు. తనపై మీడియాలో వచ్చేవి అబద్ధాలని... తాను కొన్న ఆస్తులపై వివరాలు తీసుకున్నారని తెలిపారు. ఏదో ఊహించుకుని ఐటీ అధికారులు వచ్చారు... కానీ ఏమీ దొరకలేదన్నారు. ఐటీ అధికారులకు తమ సీఏ పూర్తి వివరాలు ఇచ్చారన్నారు. మంగళవారం రోజు రమ్మని నోటీసుల్లో తెలిపారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

కాగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ ఇంట్లో ఐటీ సోదాలు ముగిశాయి. గత మూడు రోజులుగా ఎమ్మెల్యే ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డికి సంబంధించిన కంపెనీలు వాటికి సంబంధించిన ఆడిటర్లు వారి ఆర్థిక లావాదేవీలపై ఐటీ దృష్టి పెట్టింది. సోదాల్లో కీలక మైనా సమాచారాన్ని అధికారులు సేకరించారు. ఎమ్మెల్యేకు కంపెనీలు, వ్యాపార వ్యవహారాలు, వారు చెల్లిస్తోన్న పన్నులుకు మధ్య భారీ వ్యత్యాసాన్ని ఐటీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. పైళ్ల శేఖర్ భార్య వనితా రెడ్డికి చెందిన తీర్థా గ్రూప్ సంస్థ, వైష్ణవి వ్యాపార సంస్థలకు సంబంధించిన లావాదేవీలను కూడా ఐటీ శాఖ పరిశీలించినట్లు తెలుస్తోంది. తీర్థా గ్రూప్‌కు డైరెక్టర్‌గా ఉన్న వనితా రెడ్డి బంధువుల ఇళ్లలో కూడా సోదాలు జరిపి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలకు సంబంధించి హైదరాబాద్, బెంగళూరులో సాగించిన వెంచర్లు, విల్లాల అమ్మకాల్లో నగదు లావాదేవీలను గుర్తించినట్లు సమాచారం. ఇద్దరు ఎమ్మెల్యేలు వారి కుటుబ సభ్యుల పేర్లతో ఉన్న బ్యాంకు లాకర్లను ఐటీ అధికారులు గుర్తించారు. కీలక డాక్యుమెంట్లు, విలువైన ఆభరణాలను ఐటీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

# జూన్ 30న కాంగ్రెస్ కండువా కప్పుకోనున్న పొంగులేటి

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. ఆయన ఏ రోజు కాంగ్రెస్‌లో చేరబోతున్నారనే దానిపై కూడా స్పష్టత వచ్చింది. ఈ నెలాఖరున అంటే జూన్ 30న పొంగులేటి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.

పొంగులేటితో పాటు జూపల్లి కృష్ణారావు తదితరులు కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. ఈనెల 22న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పొంగులేటి, జూపల్లి, కూచుకుళ్ళ దామోదర రెడ్డి, పిడమర్తి రవి తదితరులు భేటీ కానున్నారు. భేటీ అనంతరం తెలంగాణలో వేరువేరు బహిరంగ సభల్లో పలువురు నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈనెల 30న ఖమ్మంలో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. ఖమ్మం సభలో పొంగులేటి అండ్ టీమ్ కాంగ్రెస్ కండువా కప్పుకోనుంది. ఈ సభకు రాహుల్ గాంధీ లేదా ప్రియాంక గాంధీ హాజరయ్యే అవకాశం ఉంది. పొంగులేటితో పాటు పాయం వేంకటేశ్వర్లు, కోరం కనకయ్య, పిడమర్తి రవి, తెల్లం వెంకట్రావు, బానోత్ విజయాబాయి, కోటా రాంబాబు, మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, కొండూరి సుధాకర్, జారె ఆదినారాయణ, దొడ్డా నగేష్ యాదవ్ హస్తం పార్టీలో చేరనున్నారు. అలాగే మహబూబ్‌నగర్ బహిరంగ సభలో జూపల్లి అండ్ టీమ్ కాంగ్రెస్ కండువా కప్పుకోనుంది. జూపల్లితో పాటు దామోదర్ రెడ్డి, మేఘారెడ్డి, కుచ్చారెడ్డి, తదితరులు కాంగ్రెస్‌లో చేరనున్నారు.

# పని ఇద్దరిది-పని భారం పది మందిది

## -జోగులాంబ గద్వాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తట్టే మహేష్

గద్వాల జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్ర ప్రభుత్వం బిసి లకు లక్ష రూపాయల లోన్ అనగానే జాతరను తలపిస్తుంది గద్వాల తహసీల్దార్ కార్యాలయం.20-50 వేల మంది జనాభ వున్న మండలానికి ఇద్దరు అధికారులు.లక్ష-రెండు లక్షలు జనాభ వున్నా మండలానికి ఇద్దరు అధికారులు.గద్వాల తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్నది ఇద్దరు రెవెన్యూ అధికారులే. కానీ పని భారం మాత్రం పది మంది రెవెన్యూ అధికారులది.జిల్లా కేంద్రంలో ప్రోటో కాల్ వాళ్ళే చూడాలి, అధికారుల మంచి-చెడులు వాళ్ళే చూడాలి,ప్రెస్, పోలీస్, పొలిటికల్ వాళ్ళు ఎవరైనా కార్యాలయంకు వస్తే పరిష్కారం వాళ్ళే చెప్పాలి,భూ సమస్యలు వాళ్ళే చూడాలి, సర్టిఫికెట్స్ వాళ్ళే చూడాలి... ఇలా ఒక్కటా రెండా? చెబుతూ పోతే వాళ్ళ సమస్యలు ఒక లక్ష.ఇందులో ఏ ఒక్కరిని ఆగండి చేస్తాం, చూస్తాం అనడానికి రాదు.అలా ఒకవేళ చెప్పారనుకోండి అప్పుడు పైనుండి రెకమెండేషన్ మళ్ళీ..... ఆముదానికి కొత్తిమీర బిర్యానీ అడిగింది అన్నట్టుగా వుంది ఈ ఇద్దరి ఉద్యోగం అని అనుకుంటున్నారు సామాన్య ప్రజానీకం సైతం.60-70 ఏళ్ళ వయసులో రావాల్సిన రోగాలు 35-45 ఏళ్ళ వయసులో వస్తున్నాయంటే ఇలాంటి పనిభారం వున్నప్పుడు రాక తప్పదు అంటున్నారు వైద్యులు.37 వార్డులున్న ఇంత పెద్ద గద్వాల పట్టణం,సుమారు 25 కి పైగా వున్న గ్రామపంచాయతీలు వున్న గద్వాల మండలానికి ఒకే కార్యాలయం ఉండటమే పని భారానికి కారణం అంటున్నారు. మండలానికి సపరేట్ తహసీల్దార్ కార్యాలయం, పట్టణానికి సపరేట్ తహసీల్దార్ కార్యాలయం ఉంటేనే అధికారులు అందరూ అందుబాటులో ఉంటారు. పని త్వరగా పూర్తి చేయడానికి ఆస్కారం ఉంటుంది.జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ దిశగా అడుగులు వేసి కార్యాలయాలను మెరుగు పరిస్తే బాగుండు అని ప్రజలు అనుకుంటున్నారు.

# వంద రోజుల కంటి వెలుగు సంబరం.. కేక్ కట్ చేసిన మంత్రులు



హైదరాబాద్, జూన్ 17:వంద రోజుల కంటి వెలుగు సంబరాలు బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు, మంత్రులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్,టూఎఆఅ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ తో కలిసి కేక్ కట్ చేశారు. ఈ పథకం విజయవంతంగా 100 రోజులు పూర్తి చేసుకోవడం పట్ల మంత్రి హరీశ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు ఆశా వర్కర్లకు కేక్ కట్ చేసి తినిపించి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కంటి వెలుగు విజయవంతంగా నిర్వహించేందుకు పాలు పంచుకున్న వైద్యారోగ్య శాఖ.. సహకరించిన ఇతర శాఖలు, ప్రజా ప్రతినిధులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అలో చనతో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ఈరోజు 100 రోజులు పూర్తి చేసుకొని, లక్ష్యానికి మించి కంటి పరీక్షలు చేయడం జరిగిందన్నారు.నివారింపదగిన, అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ఎంతో మందికి కంటి వెలుగును ప్రసాదించిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి 61 లక్షల మందికి కంటి పరీక్షలు చేసారు. ఇందులో దృష్టి లోపం ఉన్న 40.59 లక్షల మందికి అంటే 25.1 శాతం మందికి గ్లాసెస్ పంపిణీ చేయడం జరిగింది. ఇందులో 22.51 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు, మెడిసిన్స్ అందించారు. 18.08 లక్షల ప్రిస్కిప్షన్ గ్లాసెస్ కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. మొత్తంగా ఇప్పటికే 24 జిల్లాల్లో కంటి వెలుగు కార్యక్రమం పూర్తయింది. మిగిలిన 9 జిల్లాలో కూడా ఇదే స్ఫూర్తి నీ కొనసాగిస్తూ కంటి వెలుగు పరీక్షలు పూర్తి చేయాలని మంత్రి సూచిం చారు. కంటి వెలుగు సంబరాలలో మంత్రులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, టూఎఆఅ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ తో పాటు వైద్యారోగ్య శాఖ సెక్రెటరీ రిజ్వి, హెల్త్ కమిషనర్ శ్వేత మహంతి, డి హెచ్ శ్రీనివాసరావు, టివివిపి కమిషనర్ అజయ్ కుమార్, టిఎస్ఎంఎస్ ఐడిసి ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ స్వరాజ్య లక్ష్మి, ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



# చదువుతోనే అభివృద్ధి సాధ్యం - గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ. శ్రీధర్

### -గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి



సంగారెడ్డి, జూన్ 17 (నేటి నిజం ప్రతినిధి): చదువుతోనే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థులు సంతోషంగా చదువుకునేలా అన్ని విధాల ప్రోత్సహిస్తుందని గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ. శ్రీధర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కంది మండలం వడ్డెన గూడ తాండ లో నిర్వహించిన గిరిజనోత్సవం కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా కలెక్టర్, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పాల్గొన్నారు. ముందుగా తండా ప్రజలు, అధికారులు ప్రజా ప్రతినిధులు ఊరేగింపుగా తెలంగాణ క్రీడా ప్రాంగణానికి వెళ్లి మొక్కలు నాటి వాలీబాల్ ఆడారు. అనంతరం రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనముకు భూమి పూజ చేశారు. పిమ్మట భవాని మాత ఆలయం లో పూజలు నిర్వహించి, పక్కనే ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిరిజన శాఖ మంత్రి సందేశాన్ని వినిపించారు.

గిరిజనుల అభివృద్ధికి సంబంధించిన మూడు నిమిషాల నిడివి గల వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ, గత 9 సంవత్సరాలుగా మనం చేస్తున్న కార్యక్రమాలు, అభివృద్ధి ఏ విధంగా ఉన్నదన్నది ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందన్నారు. చదువుతోనే అభివృద్ధికి బీజం పడుతుందని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యను పెంపొందించడానికి హాస్టల్స్ ను పెంచడం, గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో వంద గిరిజన గురుకుల పాఠశాలలు ఏర్పడ్డాయని దీంతో విద్యార్థులు నిర్భయంగా చదువుకుని ఉన్నతంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆశ్రమ, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి, వారు చదువుకోవడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసిందన్నారు. గతంలో తాను కలెక్టర్ గా పని చేసిన కాలంలో చదువుకున్న వారితో లింగాల గ్రామానికి వచ్చిన గుర్తింపుగురించి వివరించారు. చదువు ఒక ఊరిని కుటుంబాన్ని మార్చగలదని, ప్రభుత్వం విద్యకు అధిక నిధులు కేటాయిస్తుందని అన్నారు. గిరిజనులకు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, ఆయా కార్యక్రమాలతో గిరిజనులు ఎదగడంతోపాటు వారు మరో పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారన్నారు. ప్రభుత్వం బిజినెస్ లో మెలుకువలు నేర్పించి వారిని వ్యాపారవేత్తలుగా మార్చుతుందన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయన్నారు. 500 జనాభా ఉన్న ప్రతి గిరిజన తండాను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, గత సంవత్సరం రెండువేల గ్రామపం చాయతీ భవనాలకు మంజూరి ఇచ్చామని, అన్ని విధాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 2100 కోట్లతో 1800 గిరిజన గ్రామాల్లో బీటీ రోడ్లు రెన్యువల్స్ చేసు కున్నామన్నారు. వ్యక్తిగతంగా విద్యాపరంగా అభివృద్ధి జరుగుతుందని, వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ఒకప్పుడు వేసవికాలంలో తండాకు వస్తే ఖాళీ బిందెలతో అడుకొని నిరసనలు తెలిపే వారని, ఈ రోజు ఖాళీ బిందెలు లేవనీ, ప్రతి ఇంట్లో నిండు బిందెతో ఉన్నాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీళ్లు వస్తున్నాయన్నారు. గతంలో 200 రూపాయలు పింఛను ఉంటే ఇప్పుడు వృద్ధులు ,వితంతువులకు 2016 రూపాయలు, వికలాంగులకు 4016 రూపాయలు వస్తుందన్నారు. వృద్ధులకు పింఛన్ తో బరోసా లభించిందన్నారు. జిల్లాలో ఐదు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు అయ్యాయని, సుమారు 4 వేలమంది గిరిజన విద్యార్థులు సంక్షేమ పాఠశాలల్లో చదువుకుం టున్నారని, సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారని అన్నారు. వారి స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. కళ్యాణ లక్ష్మి ద్వారా జిల్లాలో 4వేల మంది గిరిజనులకు 4 కోట్ల రూపాయలు అందించామని, సబ్సిడీ రుణం కింద గతంలో 1.40 కోట్లు అందించగా ఇప్పుడు 2. 40 కోట్లు ఇచ్చామ న్నారు. మా గుడెం లో మా రాజ్యం మా తండాలో మా పాలన కావాలన్న గిరిజనుల దశాబ్దాల కలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. జిల్లాలో 81 గిరిజన తండాలు గ్రామపం చాయతీ లుగా ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. గిరిజనులు ఐక్యంగా ఉండి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అందిపుచ్చుకొని అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ 2014 కు ముందు చాలా తండాలకు రోడ్లు ,నీళ్లు, విద్యుత్ ఏమీ లేవని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి గూడానికి, పల్లెకు, తండాకు నీరు, విద్యుత్, రోడ్లు వచ్చాయన్నారు. గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి గిరిజనులకు మంచి విద్యను అందిస్తున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో గిరిజన లా కాలేజీ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గిరిజన నివాస ప్రాంతాలలో అన్ని సదుపాయాలు సమకూరాయన్నారు. అంతకు ముందు గ్రామ పూజారి , తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలలో చదువుకుంటున్న పలువురు విద్యార్థులు తమ మనోభావాలను వెలిబుచ్చారు. అనంతరం ఆలయ పూజారులకు, పదవ తరగతిలో 10/10 జీ పి సాధించిన నికిత కు, 9.5/10 సాధించిన నేనావత్ స్వప్న, ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన నేనావత్ దీపిక, నేనావత్ ప్రవంతి లకు, పోలీస్ అధికారి, తహసిల్దార్, సర్పంచ్లను ప్రత్యేక కార్యదర్శి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నరహరి రెడ్డి, ఎంపీపీ సరళ, జడ్పిటిసి లు, జిల్లా అధికారులు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, గిరిజన తండా ల ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీ భవన్‌లో రసాభసాగా మారిన బీసీ బంధు సమావేశం..

-బీసీలను చీల్చుతున్న ప్రభుత్వ కుట్రలో భాగస్వామ్యులుగా కులసంఘ నాయకులు..

-చేనేత వర్గానికి తీవ్రంగా నష్టం వాటిల్లినా,400 మంది నేతన్నలు ఆత్మహత్య పాలయినా ప్రభుత్వాన్ని ప్రశ్నించని పద్మశాలీ భవన్ నేతలు..

- రెండు వారాల వ్యవధిలో చేనేత ఆత్మహత్య బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం

-కుల సంఘాల భవనాలను రాజకీయ వేదికలుగా మారుస్తున్నారు..బీసీలకు ఇప్పుడు కావాల్సింది పథకాలు కాదు, అధికారంలో వాటా..

-పద్మశాలీ భవన్ వేదికగా బీసీల ఉద్ఘాటన..

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్); హైదరాబాద్ నారాయణ గూడలో పద్మశాలి భవన్ లో అఖిల భారత పద్మ శాలి సంఘం ఆధ్వర్యంలో... బీసీ బంధు , భవిష్యత్తు కార్యాచరణపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రసాభాస మారింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ , తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు ఆచార్య కోదండరామ్ తో పాటు... పలు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. సమావేశం జరుగుతుండగా... బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ పెద్ద ఎత్తున చేనేత ఆత్మహత్య బాధిత కార్మిక వితంతు మహిళలతో కలిసి ఒక్కసారిగా వాగ్వాదానికి దిగారు. బాధిత మహిళలు తమ ఆవేదనను తెలియజెప్పడానికి నిర్వాహకులు అవకాశం ఇవ్వకపోవడమే కాకుండా రాష్ట్రంలో గడచిన 9 ఏళ్లలో 400 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకొని, కనీసం వారిని పరామర్శించని అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు బీసీ బంధు పేరుతో కొత్త నాటకం ఆడుతున్నారని దాసు సురేష్ మండిపడ్డారు.

ఇదే విషయంపై సంఘం నాయకులను నిలదీశారు.

దింతో భయానక వాతావరణం నెలకొంది.. కార్యక్రమానికి హాజరైన వివిధ పార్టీల సీనియర్ నాయకులు సర్ది చెప్పే ప్రయత్నాలు చేసినా బాధిత మహిళలు తీవ్రంగా ప్రతిఘటించడంతో ఒక్క సారి వాతావరణం వేడెక్కింది.

ఇరు వర్గాలకు తోపులాట తో బాటు తీవ్ర వాగ్వివాదం జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను శాంతింప జేశారు.

ఒకప్పుడు పద్మశాలి భవన్ ను ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యమానికి నిలయం చేశారని... కానీ ప్రస్తుత పద్మశాలి నాయకులు పాలకులకు తొత్తులుగా మారిపోయారని పద్మశాలీ నాయకత్వాన్ని నిర్వీర్యం చేస్తున్నారని దాసు సురేశ్ మండిపడ్డారు.

చేనేత కార్మికుల ఆత్మహత్యలు , సహకార సంఘాల నిర్వీర్యం , నకిలీ చేనేతలు, చేనేతపై జీఎస్టీ వంటి సమస్యలను పట్టించుకొని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అఖిల భారత పద్మశాలీ భవన్ నాయకులు ప్రభుత్వానికి తొత్తులుగా మారి వారి స్వార్థ ప్రయోజనాలకు పద్మశాలీలను , ప్రజలను బలి చేస్తున్నారని ఆరోపించారు..రెండు వారాల వ్యవధిలో 400 మంది ఆత్మహత్య బాధిత చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడానికి దిగిరాకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని, బాధిత ఆడబిడ్డలకు అండగా ఈ సమావేశానికి విచ్చేసిన నాయకులందరూ మానవతా దృక్పథంతో అండగా నిలవాలని దాసు సురేశ్ కోరారు..

బీసీ లకు రాజకీయ అధికారం తోనే వారి సమస్యలు పరిష్కరింపబడుతాయని అలా కాక కుల సంఘ నాయకులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తూ ప్రజల దృష్టి మళ్లిస్తూ పథకాలపై చర్చలు చేయడం విలువైన కాలాన్ని హరిస్తాయని హెచ్చరించారు.

# టీడీపి పునర్ నిర్మాణం, పూర్వ వైభవం కోసం సమిష్టిగా కృషి చేయండి

-టీడీపి హయాంలోనే ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి.

-టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్.

-నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నేతలతో కాసాని సమీక్షా సమావేశం



హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలుగుదేశం పార్టీని పునర్నిర్మించి పూర్వ వైభవం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు . హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో నల్గొండ పార్లమెంట్ పరిధిలోని తెలుగుదేశం పార్టీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థగత నిర్మాణం, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం, పార్లమెంట్ కమిటీ ఏర్పాటు, త్వరలో నిర్వహించబోయే బస్సు యాత్రపై చర్చించారు.. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ నల్లగొండ ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీకి బలమైన పునాదులు కలిగి ఉన్నాయని, పార్టీని పునర్నిర్మించి పూర్వ వైభవం కోసం నాయకులందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. జిల్లాలో టిడిపి హాయంలోనే అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేశామని.. టీడీపీ హాయాంలో దేశంలోనే మొట్టమొదటిగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏఎంఆర్ ప్రాజెక్టును నిర్మాణం చేసింది నల్లగొండ జిల్లాలోనే గుర్తు చేశారు. స్వర్గీయ ఎన్టీ రామారావు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి పార్టీకి ఉన్న పునాదులను పటిష్ట పరచాలన్నారు. త్వరలో నిర్వహించబోయే బస్సు యాత్రను విజయవంతం చేయడం కోసం అందరూ అభిప్రాయాలు తీసుకున్నారు. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కీలకపాత్ర పోషించనుందని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పార్టీ కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి లు జక్కలి ఐలయ్య యాదవ్. తుమ్మల మధుసూదన్ రెడ్డి, పార్లమెంట్ బాధ్యులు నెల్లూరు దుర్గాప్రసాద్. సూర్యాపేట నాగార్జునసాగర్. నల్లగొండ దేవరకొండ హుజూర్నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్లు నాతాల రామ్ రెడ్డి. మువ్వా అరుణ్ కుమార్. ఎల్.వి యాదవ్. వసుకుల దుర్గయ్య మాండవ వెంకటేశ్వర్లు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మత్తినేని సైదేశ్వర రావు. రాష్ట్ర కార్యదర్శి బయ్య నారాయణ, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# యూపీ డిఫెన్స్ కారిడార్‌లో బ్రహ్మోస్ క్షిపణలు, డ్రోన్ల తయారీ

### -కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

లక్నోజూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ లో కేవలం నట్లు, బోల్టులు తయారీనే కాకుండా, బ్రహ్మోస్ క్షిపణలు, డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్లను కూడా తయారు చేస్తామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రక్షణ శాఖ ఎగుమతిదారుగా భారతదేశం త్వరలోనే ప్రపంచ పటంలోనే చోటు సంపాదించుకోనుందని చెప్పారు. డిఫెన్స్ కారిడార్ ప్రాజెక్ట్ శరవేగంగా పూర్తి చేయడానికి కేంద్రం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద ఉత్తరప్రదేశ్, తమిళనాడులో డిఫెన్స్ కారిడార్లను అభివృద్ధి వరచనున్నట్టు తెలిపారు.''యూపీ కారిడార్ విషయంలో కీలకమైన విషయం ఏమిటంటే అక్కడ కేవలం నట్లు, బోల్టులు, విడిభాగాల తయారీకే పరిమితం కాదు. డ్రోన్లు, యూఏవీలు, ఎలక్ట్రానిక్ వార్‌వేర్ (సిస్టమ్స్), ఎయిర్‌క్రాఫ్ట్, బ్రహ్మోస్ క్షిపణలు కూడా తయారవుతాయి. విడిభాగాల కూర్పు ఉంటుంది" అని రాజ్‌నాథ్ తెలిపారు. లక్నోలో శనివారంనాడు జరిగిన ''ఆత్మనిర్భర్ భారత్" కార్యక్రంలో ఆయన మాట్లాడుతూ, అంతరిక్ష, రక్షణ రంగాల్లో విదేశీ సరఫరాదులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ (యూపీడీఐసీ)ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని అన్నారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడులో డిఫెన్స్ కారిడార్ల ఏర్పాటు చేద్దాం అందుకు తగిన వాతావరణాన్ని ఏర్పరచనున్నట్టు చెప్పారు.''ఈ కారిడార్ కోసం 1,700 హెక్టార్ల భూమిని సేకరించాలనే ప్లా?న్ ఉంది. ఇందులో 95 శాతం భూమిని ఇప్పటికే సేకరించాం. ఇందులో 36 పరిశ్రమలు, సంస్థలకు సుమారు 600 హెక్టార్ల భూమిని కేటాయించాం. రూ.16,000 కోట్ల విలువచేసే పెట్టుబడి విలువ కలిగిన 109 ఎంఓయూలపై సంతకాలు కూడా జరిగాయి" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్‌ను ఉత్తరప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌వైస్ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ అథారిటీ (యూపీఈఐడీఏ) ఏర్పాటు చేస్తుండగా, ఇందులో ఆరు నోడల్ పాయింట్లు- ఆగ్రా, అలీగఢ్, చిత్రకూట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నో ఉంటాయి. తమిళనాడు డిఫెన్స్ కారిడార్‌లో చెన్నై, కోయింబత్తూరు, హోసూరు, సేలం, తిరుచపల్లి నోడల్ పాయింట్లుగా ఉంటాయి.

స్వయం సమృద్ధి అనేది ఆప్షన్ కాదు, అవసరం..

వేగంగా మారుతున్న ప్రపంచంలో స్వయం సమృద్ధి అనేది ఒక ఆప్షన్ కాదని, అవసరమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రతి రంగంలోనూ స్వయం సమృద్ధి సాధించాలని తమ ప్రభుత్వం కోరుకుంటోందని, ముఖ్యంగా దేశ భద్రతకు సంబంధిచిన అంశమైన రక్షణరంగం చాలా కీలకంగా భావిస్తోందని చెప్పారు. 1971 యుద్ధంలో మనకు ఆయుధ సామగ్రి అవసరం ఏర్పడినప్పుడు చాలా మంది నిరాకరించారని, దాంతో ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవలసి వచ్చిందని, మన విజ్ఞప్తిని తోసిపుచ్చిన దేశాల పేర్లు తాను వెల్లడించదలచుకోలేదని చెప్పారు. 1999లో కార్గిల్ యుద్ధం సమయంలోనూ ఇదే కథా పునరావృతమైందని చెప్పారు. కార్గిల్ యుద్ధం సమయంలో మన సాయుధ బలగాలు ఆయుధాల కొరతను చవిచూడాల్సి వచ్చిందని, అప్పుడు కొన్ని దేశాలు శాంతి పాఠాలు మనకు నేర్పించాలని చూశాయని అన్నారు. సంప్రదాయకంగా మనకు ఆయుధాలు సరఫరా చేసే దేశాలు కూడా నిరాకరించాయని ఆయన గుర్తుచేశారు. ఆయా కారణాల రీత్యా మనంతగా మనం బలం బలపడటమే తప్ప మరో మార్గం లేదని తాము గ్రహించామని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

# కలుపుడే కాదు రిజర్వేషన్లు పెంచాల్సిందే

-రిజర్వేషన్లు పెంచకుండా బీసీ కులాలను ఏ విధంగా కలుపుతరు..?

-బిసి జాబిత దర్మం సత్రం అనుకున్నార...?

- జాతీయ బిసి కమిషన్ నిర్ణయం పై జాజుల శ్రీనివాస్ గౌడ్ ఫైర్

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); దేశవ్యాప్తంగా రాష్ట్ర జాబిత లో ఉండి కేంద్ర జాబితాలో లేని కులాలను ఓబిసి జాబితాలో కలిపితే ఎవ్వరికీ అభ్యంతరం లేదని,కాని ఏలాంటి అర్హత లేని కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో కలుపుతే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటన లో కేంద్రాన్ని హెచ్చరించారు. నిన్న డిల్లిలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ ఆన్సరాజ్ గంగారాం హైర్ దేశ వ్యాప్తంగా 80 కులాలను కేంద్ర ఓబిసి జాబితాలో చేర్చాలని నిర్ణయించినట్లు ప్రకటించారని, రోజుకొక కూలాన్ని బీసీ జాబిత లో కలుపుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్లను మాత్రం ఒక్క శాతం కూడ ఎందుకు పెంచడం లేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి జాతీయ బీసీ కమిషన్ కు చిత్తశుద్ధి ఉంటే రోజుకు ఒక కులాన్ని కలుపుతూ బీసీ రిజర్వేషన్లు మాత్రం ఒక్క శాతం కూడా పెంచకపోవడం వలన ప్రస్తుతం ఉన్నటువంటి బీసీ కులాలకు,ఇదే సమయంలో ఓబీసీ జాబితాలో చేరబోయేటువంటి కొత్త కులాలకు కూడా న్యాయం జరగదని ఆయన అన్నారు. దేశంలో ఇప్పటికే 2650 బీసీ కులాలు ఉంటే జనాభాలో 60 శాతం ఉన్నటువంటి బీసీ కులాలకు కేవలం దేశవ్యాప్తంగా 27%,రాష్ట్రంలో 29% రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, ఇందులో కూడ బీసీ క్రిమిలేయర్ విధించి రిజర్వేషన్లకు కోత పెడుతున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిజంగా కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇతర సామాజిక వర్గాలకు అలాగే అగ్రవర్ణాలతో సహా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన కేంద్రం, బీసీలకు మాత్రం జనాభ దామాష ప్రకారం ఎందుకు కల్పించడం లేదన్నారు. బిసిలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచి , కొత్తగా బీసీ కులాలను కలిపితే అందరికి న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా కూడ వివిధ రాష్ట్రాల మాదిరిగా బీసీలకు ఏబిసిడి వర్గీకరణ లేకపోవడం మూలంగా దేశంలోని అత్యంత వెనుకబడిన వాళ్లకు, సంచార జాతులకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం దేశంలో బీసీ జాబితాలో ఉన్న కులాల కంటే... అగ్రవర్ణాలలో ఉన్నటువంటి కులాలకే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సమానమైనటువంటి అవకాశాలు దక్కుతున్నాయని, బీసీలకు మాత్రమే సమాన అవకాశాలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు . తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుండి 80 కులాలను కలుపుతామని జాతీయ బిసి కమిషన్ నిర్ణయం తీసుకోవడం వలన బీసీ రిజర్వేషన్లు మూరెడు. .బిసి జాబితా బారెడుగా మార్చారని, దీనివల్ల ఏ కులానికి,ఎవరికి ప్రయోజనం .ఉండదని, పళ్లెంలో పాలు పోసి కొంగలను తాగమనట్టుగా ఉంటుందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు .బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచకపోతే వచ్చే ఎన్నికల్లో బిజెపి పార్టీ రాజకీయంగా కర్ణాటక తరహాలో నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు

# నేడు తెలంగాణ మంచినీళ్ల పండుగ - కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి, జూన్,17 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ( జూన్,18న) మునిపల్లి మండలం భూసారెడ్డిపల్లి నీటి శుద్ధి కేంద్రం వద్ద ఉదయం 10 గంటలకు మంచినీళ్ల పండుగ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. మంచినీళ్ల పండగ ను పురస్కరించుకొని ఆదివారం జిల్లాలో మునివల్లి మండలం భూసారెడ్డిపల్లిలో గల మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను వివిధ వర్గాల ప్రజలు, పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులతో సందర్శన చేస్తారని, అనంతరం సభ నిర్వహిస్తారని తెలిపారు. ఒకప్పుడు తాగునీరు- ఇప్పుడు తాగునీరు నినాదంతో మంచినీళ్ల సరఫరా ప్రగతి, నీళ్లను శుభ్రం పరుచుతున్న తీరును, ఇంటింటికి నల్లాల ద్వారా సరఫరా అవుతున్న తీరును వివరిస్తారని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు, మత్స్యకారులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

# త్వరలో గిరిజనులకు పోడు పట్టాలు : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి




కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 17: గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గిరిజనులకు త్వరలో పోడు పట్టాలు అందజేస్తామని వెల్లడించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జైనూర్ మండలం మార్లవాయిలో నిర్వహించిన గిరిజన ఉత్సవంలో మంత్రి పాల్గొన్నారు. గుస్సాడీ నృత్యానికి సంబంధించిన కోచింగ్ సెంటర్ ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. గిరిజనులకు అండగా ఉండే జీవో నెంబర్ 3ను తిరిగి అమలు చేసే దిశగా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. త్వరలో జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా గిరిజనులకు పోడు పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు. గిరిజన జిల్లా ఏర్పాటు చేసి అభివృద్ధి దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్లవాయిలో గిరి వికాసం ద్వారా 30 మందికి లబ్ది చేకురుస్తున్నామని రానున్న రోజుల్లో మరింత మందికి అవకాశం కల్పిస్తామన్నారు.

గుస్సాడీ అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మీ, ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, నిర్మల్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్పేయి, ఎస్పీ సురేశ్ కుమార్, పద్మ అవార్డు గ్రహీత కనకరాజు, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరీబాయి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనకయాదవరావు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ట్రాన్స్‌జెండర్‌ను పెళ్లి చేసుకున్న యువకుడు

రాజన్న సిరిసిల్ల, జూన్ 17:(నేటి నిజం ప్రతినిధి): ప్రేమకు హద్దులు లేవని మరోసారి నిరూపించింది ఈ జంట. ట్రాన్స్‌జెండర్‌తో ఐదేళ్లుగా సహజీవనం చేస్తున్న ఓ యువకుడు శనివారం పెళ్లి చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయంలో జరిగిన ఈ వివాహానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన 23 ఏండ్ల శ్రీనివాస్, వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన 22 ఏండ్ల హిజ్రా పింకీ గత ఐదేండ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఇద్దరూ ఐదేండ్లుగా సహజీవనం చేస్తున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకోవడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకరిద్దరు బంధువులతో పాటు తెలిసిన వాళ్లతో కలిసి వేములవాడకు వచ్చి రాజన్న ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. కాగా, శ్రీనివాస్ డిగ్రీ పూర్తి చేయగా, ప్రస్తుతం ప్రైవేట్ జాబ్ చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఇద్దరం కూడా ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నట్లు మీడియాకు వెల్లడించారు.


ఆహ్వానం

4-6 కిన్నెర

కిన్నెర ఆర్ట్ థియేటర్స్
ద్వానా సాహితీ కుటీరం
సంయుక్త ఆధ్వర్యంలో

సాహిత్య సవ్యసాచి, విమర్శన కళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రిగారి
76వ జయంతి సందర్భంగా



ప్రముఖ కవి, రచయిత
డా॥ కూరెళ్ళ విఠలాచార్యగారికి
కిన్నెర-ద్వానాశాస్త్రి స్మారక
పురస్కారం-బహూకరణ



శుక్రవారం 23-06-2023, సా॥ 6 గంటలకు
రవీంద్రభారతి సమావేశ మందిరం,
మొదటి అంతస్తు, హైదరాబాదు

ముఖ్యఅతిథి : జస్టిస్ కె. లక్ష్మణ్, గౌ॥ న్యాయమూర్తి, తెలంగాణ హైకోర్టు
అధ్యక్షులు : డా॥ కె.వి.రమణ, ఐఏఎస్ (రి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహా రెడ్డి అదనపు కలెక్టర్, మేడ్చల్, మల్కాజిగిరి
గౌరవ అతిథి : డా॥ వోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త
ఆత్మీయ అతిథులు : శ్రీ బైస దేవదాసు, నేటినిజం సంపాదకులు
శ్రీ ద్వాదశి శశికాంత్, ద్వానా శాస్త్రి కుమారుడు

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి

# రైతులకు వెంటనే పంట నష్ట పరిహారం అందించాలి

## -సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అశోక్,




రాజన్న సిరిసిల్ల, జూన్ 17:(నేటినిజం ప్రతినిధి): రైతులకు వెంటనే పంట నష్ట పరిహారం అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత అశోక్ లు అన్నారు. సిరిసిల్ల డివిజన్ కేంద్రంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత అశోక్ లు మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల పేరిట కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కన్నీళ్లు మాత్రం పట్టడం లేదా అని ఎద్దేవా చేశారు. అకాల వర్షంతో ఇప్పటికే చాలామంది రైతులు నష్టపోయారని, నష్టపోయిన రైతులందరికీ పంట అంచనా వేసి నష్టపరిహారం అందిస్తామని చెప్పినటువంటి నాయకులు ఇప్పటివరకు నష్ట పరిహారం అందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఓవైపు వడగండ్ల వాళ్లతోని వడ్లు రాలిపోయి ఇబ్బందులు పడుతున్నటువంటి రైతులు కొనుగోలు సకాలంలో పూర్తిగా కాకపోవడం వల్ల మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కొనుగోలు పూర్తి అయిన రైతులకు ఇన్ని రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కూడా రైతుల ఖాతాల్లో డబ్బులు పడలేక రైతులు ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితి ఉందన్నారు. మరొకవైపు వర్షాకాలానికి సంబంధించినటువంటి పెట్టుబడికి ఉపయోగపడతాయని ఆశిస్తున్నటువంటి రైతులకు ఇప్పటివరకు డబ్బులు అకౌంట్లో జమ కాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వెంటనే వడ్ల కొనుగోలు పూర్తయినటువంటి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు చెల్లించాలని, లేనియెడల రైతులందరి కలుపుకొని తీవ్ర ఉద్యమాలు రూపొందించుకుంటామని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత అశోక్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లారపు ప్రశాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ



రాజన్న సిరిసిల్ల, జూన్ 17:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో ఇటీవల మరణించిన దుర్మ్మట్ల దేవారెడ్డి (అడ్వకేట్), శాత్రాజుపల్లిలో మరణించిన కొమ్ముల లలిత కుటుంబాలను శనివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డిపరామర్శించారు.

ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాడ సానుభూతి తెలిపారు.

ఆయన వెంట సంతోష్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఐత వెంకటేశం, తిరుపతి రెడ్డి, రాజిరెడ్డి, అజీం,మహేష్ తదితరులు ఉన్నారు.

# ఉగాండాలో దారుణం.. పాఠశాలపై తిరుగుబాటుదారుల దాడిలో 25 మంది మృతి

న్యూఢిల్లీ, జూన్ 17: ఉగాండా లో దారుణం చోటు చేసుకుంది. అలైడ్ డెమొక్రటిక్ ఫోర్స్ కు చెందిన సాయుధ తిరుగుబాటుదారులు.. పశ్చిమ ఉగాండాలో మారణహోమం సృష్టించారు. కాంగో సరిహద్దు సమీపంలోని ఎంపాండ్వే పట్టణంలోని ఓ పాఠశాలపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 25 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

'ఏడీఎఫ్ కు చెందిన సాయుధ తిరుగుబాటుదారులు లుబిరిరా సెకండరీ పాఠశాలపై దాడులు జరిపారు. పాఠశాలకు చెందిన డార్మిటరీని కాల్చేశారు. ఫుడ్ స్టోర్ ను కూడా దోచుకున్నారు. ఇప్పటివరకు 25 మంది మృతదేహాలను వెలికితీశాము. మరో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించాం' అని ఉగాండా పోలీసు శాఖ ప్రతినిధి ఫ్రెడ్ ఎనాంగే వెల్లడించారు.

దాడి అనంతరం తిరుగుబాటుదారులు కాంగో దేశంలోని విరుంగా జాతీయ పార్కు దిశగా పారిపోయినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు అన్ని విధాలుగా కృషిచేస్తున్నట్టు చెప్పారు.

తూర్పు ఉగాండాలో 1990వ దశకంలో ఈ ఏడీఎఫ్ పుట్టుకొచ్చింది. 1986 నుంచి అక్కడ అధికారంలో ఉన్న ఉగాండా అధ్యక్షుడు యోవెరీ ముసెవెని పాలనను ఏడీఎఫ్ వ్యతిరేకిస్తోంది. 2001లో ఉగాండా సైన్యం చేతిలో ఓటమి తర్వాత.. డీఆర్?సీలోని నార్త్ కివు రాష్ట్రంలో రీలొకేట్ అయ్యింది.

అక్కడి నుంచి గత రెండు దశాబ్దాలుగా ఈ ఏడీఎఫ్ సభ్యులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. వీరికి ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ తోనూ సంబంధాలు ఉన్నాయి. 2021లో ఉగాండా రాజధాని కంపాలాలో జరిగిన భీకర బాంబు దాడి ఈ ఏడీఎఫ్ పనేనని ఆరోపణలు ఉన్నాయి.

# ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా వేములవాడ అభివృద్ధి

## -అబద్దాలతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప చేసిందేమీ లేదు

## -కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జూన్ 17:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ అభివృద్ధిపై శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో వందల కోట్ల అభివృద్ధి ఎక్కడ జరిగిందని ఎమ్మెల్యే రమేష్ బాబును ప్రశ్నించారు. ఎమ్మెల్యే రమేష్ బాబు ఇంటి పోరులో సతమతమవుతూ నిస్పృహతో మాట్లాడి వందల కోట్ల అభివృద్ధి అంటూ ప్రజలను రైతులను మోసం చేస్తున్నాడని విమర్శించారు. వేములవాడ బద్ది పోచమ్మ గుడికి 20 కోట్లతో అభివృద్ధి అంటున్నారని, దేవాలయం నుండి అప్పు తీసుకుని అభివృద్ధి చేయడాన్ని గొప్పతనమా అని మండి పడ్డారు. 100కోట్ల కుంభకోణం వెలికితీస్తానన్న విషయం ఏమైందని ఎమ్మెల్యే రమేష్ బాబుకు గుర్తుచేశారు. నియోజవర్గంలో ఒక్కటి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని, అబద్దాలతో ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. వేములవాడ నియోజవర్గం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా ఉందని, ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. 119 నియోజకవర్గల్లో వెనుకబడిన



నియోజకవర్గం ఏదైనా ఉన్నది అంటే ఈ 14 ఏళ్లలో వేములవాడనేనని, అది స్థానిక ఎమ్మెల్యే వైఫల్యమేనని తెలిపారు. ప్రతి ఏటా బడ్జెట్లో ఆలయ అభివృద్ధి కోసం వంద కోట్లు ఇస్తామన్న సీఎం కేసీఆర్ హామీ ఏమైందని అన్నారు. ముంపు గ్రామాలకు ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదని, ఏం మాట మాట్లాడినా వందల కోట్లు అని అంటున్నారని, డబ్బుల రూపంలో కోట్లా, లేక వేసుకునే కోట్లా ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలక రమేష్ సంఘ స్వామి యాదవ్, పాత సత్యలక్ష్మి, కనికరపు రాకేష్, నాగుల విష్ణు ప్రసాద్, నాగుల రాము గౌడ్, కూర దేవయ్య, చిలువేరి శ్రీనివాస్ గౌడ్ ,మామిడాల శ్రీకాంత్, మండే రాజు, లింగంపల్లి కిరణ్, అక్కనపల్లి నరేష్, గడ్డం రేణుకలు ఉన్నారు.

# తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చడంతోనే స్వయం పరిపాలన సాధ్యమైంది

## -జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్య ప్రసాద్

రాజన్న సిరిసిల్ల, జూన్ 17:(నేటినిజం ప్రతినిధి): గిరిజన తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చడంతోనే స్వయం పరిపాలన సాధ్యమయిందని, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తెలంగాణ గిరిజనోత్సవాన్నిపురస్కరించుకుని వీర్నపల్లి మండలం ఎర్రగడ్డ తండాలో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత పదేండ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని అందరికీ తెలిపే విధంగా రోజుకో కార్యక్రమంతో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 25 తండాలను గ్రామ పంచాయితీలుగా మార్పు చెందాయని, దీని ద్వారా గిరిజన ప్రజలకు స్వయం పరిపాలన సాధ్యమైందని అన్నారు. స్థానికంగా ఉన్న వారు గ్రామాలను పాలిస్తేనే సమస్యల మీద అవగాహన ఉంటుందని గమనించి, రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రత్యేకంగా తండాలను గ్రామ పంచాయితీలుగా మార్పు చేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తండాలు గ్రామ



పంచాయితీలుగా మారిన తర్వాత గ్రామాల్లో అనేక మార్పులు వచ్చాయని, రోడ్లు, డ్రైనేజీలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, కంపోస్ట్ షెడ్ లు, నర్సరీలు, గ్రామ పంచాయితీ భవనాలు తదితర అభివృద్ధి పనులను చేసుకున్నామని అన్నారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటుందని, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను సం రక్షిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని, సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తు ందని అన్నారు. హైదరాబాద్ లో గిరిజనుల కోసం సేవాలాల్ భవన్, ఆదివాసి భవన్, ఆత్మగౌరవ భవనాలను ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జెడ్పిటిసి గుగులోతు కళావతి, ఎంపీడీవో నరేష్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ జగ్మాల్ నాయక్, డిప్యూటీ తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి కేసీఆర్‌కు టీటీడిపి అధ్యక్షుడు కాసాని బహిరంగ లేఖ

హైదరాబాద్ జూన్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);హైదరాబాద్ లోని కోకాపేటలో ఇన్స్టిట్యూట్ ఫర్ ఎక్సెలెన్స్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ పార్టీకి 11 ఎకరాల భూమిని గజం రూ.7,500 ధరకు కేటాయిస్తూ 18 మే 2023న జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. 05 జూన్ 2023న భారత్భవన్ నిర్మాణానికి మీరు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ దేశ విదేశాల్లో రాజకీయ సామాజిక, ఆర్థిక రంగాల్లో అనుభవజ్ఞులైన గొప్ప మేధావులను, నోబెల్ విజేతలను కూడా పిలిచి రేపటి పౌరులకు ఇక్కడ నిర్మించే భవనంలో నాయకత్వ శిక్షణ ఇప్పిస్తామని, తద్వారా భారత ప్రజాస్వామిక సౌధాన్ని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ నిర్మించే 15 అంతస్తుల భవనంలో మిని హాల్స్, విశాలమైన సమావేశ మందిరాలు నిర్మిస్తామని, అత్యాధునిక డిజిటల్ లైబ్రరీలు, వసతి కోసం లగ్జరీ గదులను నిర్మిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి విన్నవించేది ఏమిటంటే బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చిన విధంగానే తెలుగుదేశం పార్టీకి సైతం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ భవన నిర్మాణానికి కోకాపేటలో గజం రూ. 7,500 లకు 11 ఎకరాల భూమిని కేటాయించవలసిందిగా విన్నవిస్తున్నాం. తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు 1980 దశకంలోనే రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించింది. కనుక తెలుగుదేశం పార్టీతోపాటు రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీలన్నింటికి 11 ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా కోరుతున్నాము. అదే విధంగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లో బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా ఆఫీసు కోసం హైదరాబాద్ జిల్లా, షేక్పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం.12లో ఉన్న ఎన్బిటి నగర్లో సర్వే నెం. 403/పి లో ఎకరం భూమిని గజం రూ.100 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చిన విధంగానే తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ జిల్లా ఆఫీసు కోసం బంజారాహిల్స్లో ఎకరం భూమిని గజం రూ.100 చొప్పున కేటాయించాలని కోరారు.

16 ఆగస్టు 2018 న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పార్టీ కార్యాలయాలకు భూముల కేటాయింపుల కోసం జీవో నెం.167 ను విడుదల చేసింది. దీని ప్రకారం గజం రూ.100 చొప్పున ఎకరం స్థలం మించకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో భూములు కేటాయించడానికి ఈ జీవో నిర్ణయం తీసుకున్నది. ఆ తర్వాత 27 జూలై 2018 న జరిగిన కేబినెట్ సమావేశంలో రూ.100 గజం చొప్పున (టీఆర్ఎస్) బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి జిల్లా కేంద్రాలలో ఎకరాకు మించకుండా భూములు కేటాయించాలని మంత్రి వర్గం నిర్ణయం తీసుకున్నది. దీని ప్రకారం 33 జిల్లాల్లో గజం రూ.100 చొప్పున బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చిన స్థలాలను తెలుగుదేశం పార్టీకి సైతం ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్కు విజ్ఞప్తి చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాల్లో పార్టీ ఆఫీసుల నిర్మాణం కోసం తెలుగుదేశం పార్టీ జులై, ఆగస్టు నెలలలో 2018 సంవత్సరంలో ఆయా జిల్లాల కలెక్టర్లకు దరఖాస్తు చేసినా ఇంత వరకు ఒక్క చోట కూడా స్థలం కేటాయించలేదు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు స్థలాలు కేటాయించి నాలుగు సంవత్సరాలైనా, ఇతర పార్టీలకు స్థలాలు కేటాయించకపోవడం పూర్తిగా అన్యాయం. హైదరాబాద్ నగరంలో రెండు చోట్లా రాష్ట్రంలో 33 జిల్లాల్లో మీ పార్టీకి స్థలాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుని రాష్ట్రంలోని మరే పార్టీకి సెంటు స్థలం కూడా కేటాయించకపోవడం పక్షపాత వైఖరితో కూడుకున్నది. ప్రభుత్వం అన్ని పార్టీలను సమదృష్టితో చూడాల్సిన అవసరమున్నదని పేర్కొన్నారు.

# బార్సిలోనాకు ఆడాలనుకున్నా.. కానీ, నా నిర్ణయం పట్ల సంతోషంగా ఉన్నా : మెస్సీ

న్యూఢిల్లీ, జూన్ 17:ఫుట్‌బాల్ ఐకాన్ లియోనల్ మెస్సీ వచ్చే సీజన్‌లో కొత్త క్లబ్‌కు ఆడనున్న విషయం తెలిసిందే. స్పెయిన్‌కు చెందిన బార్సిలోనా, సౌదీ అరేబియా క్లబ్ అల్ – హిలాల్‌క్లబ్స్ ఈ దిగ్గజ ఆటగాడితో ఒప్పందం కోసం ప్రయత్నించాయి. కానీ, మెస్సీ మాత్రం అమెరికాకు చెందిన ఇంటర్ మియామి క్లబ్‌కు ఓటేశాడు. వచ్చే సీజన్‌లో ఈ ఫార్వర్డ్ ప్లేయర్ మేజర్ లీగ్ సాకర్‌లో ఆడనున్నాడు. కొత్త క్లబ్‌కు మారడంపై ఈ స్టార్ ప్లేయర్ తాజాగా స్పందించాడు.

అర్జెంటీనా టీవీ పబ్లికాతో మాట్లాడిన మెస్సీ 'ఇంటర్ మియామి క్లబ్‌కు వెళ్లాలని తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషంగా ఉన్నానని అన్నాడు. 'పీఎస్‌జీతో రెండేళ్ల కాంట్రాక్టు ముగింపు సమయంలో నా ఆలోచనలు వేరేగా ఉన్నాయి. మొదట్లో నేను, నా టీమ్ బార్సిలోనాకు వెళ్లాలని అనకున్నాం. కానీ, మియాబి క్లబ్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం అనేది మేము వేసిన కీలకమైన అడుగు. నేను ఏం చేస్తున్నాను అనే దానిపై నాకు పూర్తి అవగాహన ఉంది' అని మెస్సీ వెల్లడించాడు.

రెండు నిమిషాల్లోనే గోల్

జూన్ 30వ తేదీన పీఎస్‌జీ క్లబ్ తరఫున మెస్సీ ఆఖరి మ్యాచ్ ఆడేశాడు. ప్రస్తుతం అతను చైనాలో ఆస్ట్రేలియాతో ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడుతున్నాడు. బీజింగ్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లోనే ఈ లెజెండరీ ఆటగాడు మెరిశాడు. ఆట ఆరంభమైన రెండు నిమిషాల్లోనే గోల్ కొట్టి ఫ్యాన్స్‌ను ఆశ్చర్యపరిచాడు. దాంతో, అర్జెంటీనా 2–0తో ఆస్ట్రేలియాను ఓడించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న మెస్సీ గత ఏడాది తమ జట్టుకు వరల్డ్ కప్(ఈఎఈం



చినీతీశ్రీట అబీజూ) అందించాడు. రెండోసారి అర్జెంటీనాను ఫైనల్‌కు చేర్చిన అతను తన వరల్డ్ కప్ కలను నిజం చేసుకున్నాడు. ఫ్రాన్స్‌తో జరిగిన టైటిల్ పోరులో మెస్సీ రెండు గోల్స్ కొట్టాడు. ఎంబాపే హ్యాట్రిక్ గోల్స్‌తో హడలెత్తించినా చివరకు షూటౌట్‌లో 4–2తో అర్జెంటీనా గెలుపొందింది.

# ప్రజల చెంతకే జిల్లా పోలీస్ యంత్రాంగం- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, జూన్ 17:(నేటినిజం ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన "మొబైల్ ఠాణా" కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం రోజున సిరిసిల్ల రూరల్ సర్కిల్ పరిధిలోని వంతడుపుల, ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ పరిధిలోని కొత్తపల్లి, వేములవాడ రూరల్ సర్కిల్ పరిధిలోని వట్టెముల, చందుర్తి సర్కిల్ పరిధిలోని నిమ్మాపల్లి గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పునస్కరించుకొని సంబంధిత ఇన్స్పెక్టర్స్ ప్రారంభించి, ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడం కోసం తగిన చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. పిర్యాదు దారుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని, పోలీసులు నిరంతరం బాధితుల పక్షాన నిలుస్తారని అన్నారు. బాధితులకు న్యాయం చేయడం పోలీసుల కర్తవ్యంలో ఒక భాగమేనని, శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీస్ శాఖ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు.



సిరిసిల్ల రూరల్ సర్కిల్ పరిధిలోని ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని వల్లంపట్ల గ్రామంలో సిఐ ఉపేందర్ ఎస్ఐ రాజేష్ తో కలసి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి వంతడుపుల గ్రామ ప్రజల వద్ద నుండి 06 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. ఒక కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని, మిగితా ఫిర్యాదుల పరిష్కరానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. తమ పరిధిలో లేని పిర్యాదులు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. భూ తగాధల సమస్యలను సివిల్ కోర్ట్ లో పరిష్కరించుకోవాలని చెప్పారు.

ఎల్లారెడ్డిపేట్ సర్కిల్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండలింగంపల్లి గ్రామంలో సిఐ మొగిలి, ఎస్ఐతో కలసి అందుబాటులో నుండి గ్రామ ప్రజల వద్ద నుండి 09 అర్జీలు స్వీకరించి, పరిష్కరానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. తమ పరిధిలో లేని పిర్యాదులు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. భూ తగాధల సమస్యలను సివిల్ కోర్ట్ లో పరిష్కరించుకోవాలని చెప్పారు.

వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నుకలమర్రి గ్రామంలో సిఐ బన్సీలాల్ ఎస్ఐతో కలసి అందుబాటులో నుండి గ్రామ ప్రజల వద్ద నుండి 08 అర్జీలు స్వీకరించి పరిష్కరానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. తమ పరిధిలో లేని పిర్యాదులు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. భూ తగాధల సమస్యలను సివిల్ కోర్ట్ లో పరిష్కరించుకోవాలని చెప్పారు.

చందుర్తి సర్కిల్ పరిధిలోని కొనరావుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిమ్మపల్లి గ్రామంలో సిఐ కిరణ్ కుమార్, ఎస్ఐ రమాకాంత్ తో కలసి ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ ప్రజల వద్ద నుండి 05 అర్జీలు స్వీకరించి, ఒక ఫిర్యాదులో ఇరు వర్గాలతో మాట్లాడి, సమస్య పరిష్కరిం చడం జరిగింది అన్నారు. మిగితా ఫిర్యాదుల పరిష్కరానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. తమ పరిధిలో లేని పిర్యాదులు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. భూ తగాధల సమస్యలను సివిల్ కోర్ట్ లో పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఇతివృత్తంగా క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను విన్నపాలు స్వీకరించి, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడం కోసం ఏర్పాటు చేసిన "మొబైల్ ఠాణా" కార్యక్రమన్నీ ప్రజలు సద్వినియోగం పర్చుకోవాలని అన్నారు.

ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

మరియు

ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం

శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీ కళాసుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్

తేది: 19-06-2023 సోమవారం, సమయం సా॥ 6.00 గం॥లకు

" శ్రీమతి ఏకా పద్మ స్మారక పురస్కార ప్రదానోత్సవ సభ "

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | డా॥ ఎస్. వేణుగోపాలాచారి<br>Chairman, TSIDC, Ex. M.P. Ex. Central Minister |
| అధ్యక్షులు | : | శ్రీ కె.వి.ఎన్. రావు<br>ప్రముఖ పారిశ్రామిక వేత్త |
| విశిష్ట అతిథి | : | శ్రీ కళా జనార్ధన మూర్తి<br>అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గాన సభ |
| గౌరవ అతిథి | : | శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం. |
| ఆత్మీయ అతిథి | : | శ్రీమతి పొత్తూరి జయలక్ష్మి, మేనేజర్, సాహితి కిరణం |
| పురస్కార గ్రహీతలు | : | డా॥ బేతపూడి శివరామ్<br>Dy. General Manager, Retd. Ministry of MSME<br>Govt. of India |
| | : | శ్రీ చింతలపాటి సురేష్, ప్రముఖ సంగీత గాయకులు |
| పురస్కార ప్రదాత | : | శ్రీ ఏకా నాగరాజ రామ మోహన రావు<br>ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్ |
| వందన సమర్పణ | : | శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని. |

కార్యక్రమమునకు ముందు : శ్రీ బాల సచ్చిదానంద చిన్నారులు

చి. సౌమ్య, చి. లహరి, చి. శ్రీముఖి, చి. శ్రీ లలిత, చి. తాన్య గార్లచే నృత్య ప్రదర్శన కలదు.

లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య

ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్ట్మెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్టు ఆనంద్ బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్-500 047. సెల్ : 94404 48650

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.